సామాన్యుడి అస్త్రం
ఆంధ్రప్రదేశ్
బుధవారం 21
జనవరి 2026


# హుకుంపేట మండలంలో సుడిగాలి పర్యటన





**సచివాలయ, పి హెచ్ సీ,రికార్డుల తనిఖీ.**

**పట్టాదార్ పాస్ బుక్ పొందిన రైతులతో ముఖా ముఖి.**

**జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజా**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** ఏ ఎస్ ఆర్ జిల్లా (పాడేరు)జనవరి 19: అల్లరి జిల్లా, హుకుంపేట మండలంలోని పలు గ్రామాలు పర్యటించి పట్టాదార్ పాస్ బుక్స్ పంపిణీపై ఆరా తీసి, లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజా. ఈరోజు ఉదయయం హుకుంపేట మండలంలోని పలు గ్రామాలు విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు, కార్యాలయాల పనితీరును పరిశీలించడమే లక్ష్యంగా ఆమె ఈ రోజు సుడిగాలి పర్యటన చేసారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రైతుల భూములు రి సర్వే నిర్వహించి, రాజముద్ర తో కూడిన పట్టాదారు పాసుబుక్కులను ముద్రించి, అర్హులైన లబ్ధిదారులందరకు పట్టాలు పంపిణీ చేసిన, రైతులతో ముఖాముఖి నిర్వహించి పట్టాల పంపిణీలో అవకతవకలు ఏమైనా జరిగాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీపై రైతులతో నేరుగా మాట్లాడారు. పాస్ పుస్తకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి, రెవెన్యూ సేవలపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, డాక్టర్ల, సిబ్బందికి సంబందించిన హాజరు పట్టిక, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందిని హెచ్చరించారు. బాకూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. సచివాలయ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు అమలు పై అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే కాక వారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని చూడటం మన బాధ్యత అని అన్నారు. ఈ పర్యటనలో స్థానిక మండల తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం

**దొంతు రమేష్ అరెస్టును తీవ్రంగా ఖండించిన ఏఐజెపిఎఫ్**



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏఐజెపిఎఫ్) ఆధ్వర్యంలో హనుమకొండలోని వేదాంత అకాడమీ వేదికగా నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జర్నలిస్టు దొంతు రమేష్‌ను అక్రమంగా అరెస్టు చేసిన ఘటనను ఏఐజెపిఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఈ అరెస్టు జర్నలిజం స్వేచ్ఛపై మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య మూల్యాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా సమావేశంలో పాల్గొన్న నేతలు అభివర్ణించారు. సమావేశంలో మీడియా అకాడమీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు ఇసంపెల్లి వేణు మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజంలో న్యాయం ధర్మం సత్యం అనే మూల సూత్రాలతో పనిచేస్తారని స్పష్టం చేశారు. నిజాన్ని నికార్సుగా, నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరచే చర్యగా మారుతుందని ఆయన హెచ్చరించారు. ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా అణగారిన వర్గాలకు చట్టబద్ధ రక్షణ కల్పించినట్టే, జర్నలిస్టులకూ ప్రత్యేక చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఇసంపెల్లి వేణు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే తీసుకు రావాలని ఆయన కోరారు. ఏఐజెపిఎఫ్ చైర్మన్ చుంచు కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టులపై అక్రమ అరెస్టులు, వేధింపులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జర్నలిస్టులను భయపెట్టి నిజాన్ని దాచే ప్రయత్నాలను ఏఐజెపిఎఫ్ ఎప్పటికీ సహించదని, జర్నలిస్టుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బింగి సుధాకర్, రాష్ట్ర అధ్యక్షులు పరకాల సమ్మయ్య గౌడ్, గౌరవ సలహాదారులు బజ్జుర్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు సీఎం కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్ సింగ్ ఠాగూర్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆకుల సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రమేష్ గౌడ్, రాష్ట్ర ఆర్గనైజర్ బి. శ్రీకాంత్, కే. సాగర్, రాష్ట్ర కార్యదర్శి పి. భరత్ తదితర నాయకులు పాల్గొన్నారు. వేదాంత అకాడమీ డైరెక్టర్‌తో పాటు పలువురు జర్నలిస్టులు, సంఘ నాయకులు హాజరై జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు.

# కార్పొరేట్ ప్రకటనల విధానంతో జర్నలిస్టులకు తీవ్ర నష్టం

**జర్నలిస్టుల జీవన భద్రత ప్రభుత్వ ప్రకటన వ్యయంతోనే సాధ్యం**

**కళానికి గౌరవం లేకపోతే ప్రజాస్వామ్యానికే ముప్పు చుంచు కుమార్**



**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** ప్రభుత్వ ప్రకటనల పేరుతో కార్పొరేట్ పత్రికా సంస్థలకు ఏటా వేల కోట్ల రూపాయలు కేటాయిస్తూ, అసలైన ప్రజాప్రయోజన లక్ష్యాన్ని ప్రభుత్వం పక్కదారి పట్టిస్తున్నదని అఖిల భారతీయ జర్నలిస్టు ప్రొటెక్షన్ ఫోర్స్ (ఏఐజేపీఎఫ్) రాష్ట్ర చైర్మన్ చుంచు కుమార్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనల అసలు ఉద్దేశం జర్నలిస్టుల జీవన భద్రతను బలోపేతం చేయడమేనని, కానీ నేటి వ్యవస్థలో ఆ నిధులన్నీ కార్పొరేట్ మీడియా యజమానుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పత్రికలకు లాభాలు నిజమైన జర్నలిస్టులకు ఖాళీ కడుపులు ప్రస్తుత ప్రకటనల విధానంలో కార్పొరేట్ మీడియా సంస్థలు ఆర్థికంగా మరింత బలపడుతున్నప్పటికీ, గ్రామాలు మండలాలు పట్టణాలు జిల్లాల్లో ప్రజల మధ్యే నిలబడి నిజాన్ని రాసే నిజమైన జర్నలిస్టులు మాత్రం ఖాళీ కడుపుతో, అప్పుల భారంతో, పేదరికపు అంచుల్లో జీవితం గడుపుతున్నారని చుంచు కుమార్ స్పష్టం చేశారు. ఈ పరిస్థితి జర్నలిజం విలువలను క్రమంగా దెబ్బతీస్తోందని, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం నిర్వీర్యమవుతున్నదని, ఇది దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకే ముప్పుగా మారుతుందని ఆయన హెచ్చరించారు. “కలానికి సంకెళ్లు వేస్తే సమాజమే బంధనంలో పడుతుంది” నిజాన్ని రాసే జర్నలిస్టుకు జీవన భద్రత లేకపోతే ప్రజలకు న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్నను చుంచు కుమార్ లేవనెత్తారు. మహాకవి శ్రీశ్రీ చెప్పిన “కలానికి సంకెళ్లు వేస్తే సమాజమే బంధనంలో పడుతుంది” అన్న భావన నేటి పరిస్థితుల్లో మరింత సత్యంగా మారిందన్నారు. కళకు గౌరవం ఇచ్చిన ప్రభుత్వం సమాజానికి వెలుగు సాంస్కృతిక కళాకారుల గౌరవ వేతనం ఒక చారిత్రాత్మక ఉదాహరణ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాంస్కృతిక కళాకారుల గౌరవ వేతన పథకం ఒక చారిత్రాత్మక ప్రజాపాలన నమూనాగా నిలిచిందని చుంచు కుమార్ గుర్తు చేశారు. అరుణోదయ కళాకారులు, జానపద కళాకారులను గుర్తించి వారికి గౌరవ వేతనం అందించడం ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాయన్నారు. “కళకు గౌరవం ఇచ్చిన ప్రభుత్వం సమాజానికి వెలుగు ఇస్తుంది” అన్న వేమన తత్వానికి ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. జర్నలిస్టులకూ గౌరవ వేతనం ప్రజాపాలనకు బలమైన వారధి అదే విధానాన్ని జర్నలిస్టుల సంక్షేమానికి కూడా అమలు చేయాలని చుంచు కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా నిజమైన జర్నలిస్టులను గుర్తించి గౌరవ వేతన వ్యవస్థ ప్రవేశపెడితే ప్రభుత్వ సమాచారం నేరుగా ప్రజల వరకు చేరుతుందని, కార్పొరేట్ మధ్యవర్తిత్వం లేకుండా పారదర్శక పాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ ప్రకటనలకు స్వస్తి జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు కార్పొరేట్ పత్రికా సంస్థలకు ఇచ్చే ప్రకటనలను పూర్తిగా రద్దు చేసి, ఆ వ్యయాన్ని జర్నలిస్టుల సంక్షేమానికి కేటాయిస్తే వేలాది జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం సంక్షేమ నిర్ణయం మాత్రమే కాకుండా, దేశంలోనే తొలిసారిగా జర్నలిస్టుల కోసం తీసుకునే చారిత్రాత్మక ప్రజాపాలన నిర్ణయంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మేడారం సాక్షిగా జర్నలిస్టులకు న్యాయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి డిమాండ్ మేడారం పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తప్పకుండా తీసుకెళ్తామని చుంచు కుమార్ తెలిపారు. సమ్మక్కసారలమ్మ సాక్షిగా, ఈ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి నిజమైన జర్నలిస్టులకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ చరిత్రలో సువర్ణ అధ్యాయం నాలుగో స్తంభానికి తిరిగి ఊపిరి కార్పొరేట్ ప్రకటనల వ్యవస్థకు స్వస్తి పలికి జర్నలిస్టులకు గౌరవ వేతన విధానం అమలు చేస్తే లక్షలాది జర్నలిస్టుల జీవితాల్లో వెలుగు నిండుతుందని, కార్పొరేట్ ఆధిపత్యానికి ఇది పతనానికి పునాదిగా మారుతుందని, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం తిరిగి బలపడుతుందని చుంచు కుమార్ తేల్చి చెప్పారు. “పొట్ట నింపని వృత్తి ప్రజలకు న్యాయం చేయదు” అన్న వేమన వాక్యానికి నేటి పరిస్థితులే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఇది డిమాండ్ కాదు ప్రజాస్వామ్య పోరాటం దేశానికి దారి చూపే తెలంగాణ మోడల్ ఈ ప్రతిపాదనపై మేధావులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు, జర్నలిస్టు సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని, ఇది యావత్ తెలంగాణలో చారిత్రాత్మక చర్చకు నాంది పలుకుతుందని ఆయన తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని స్వీకరిస్తే, రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పేరు సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందని చుంచు కుమార్ స్పష్టం చేశారు.

# ఇల్లందకుంట మండలంలో ఇందిరమ్మ లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ



**సామాన్యుడి అస్త్రం ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలం వాగొడ్డు రామన్నపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ పథకం లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీలను ఆలయ ధర్మకర్త కారింగుల రాజేందర్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ గృహ పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఈ పథకం ద్వారా నిజమైన అర్హులైన పేదలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు సహకారంతో వాగొడ్డు రామన్నపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలైన పుట్ట రజిత, పల్లవేణి, లావణ్యలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని, నిబంధనల ప్రకారం త్వరితగతిన నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆత్మగౌరవ రాజకీయాలే నా లక్ష్యం

**12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థిగా పుదారి రేణుక శివకుమార్ గౌడ్ ప్రజా విజ్ఞప్తి**



**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట పట్టణంలో 12వ వార్డు ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పుదారి రేణుక శివకుమార్ గౌడ్ ప్రజల ముందుకు స్పష్టమైన ఆలోచనతో, ఆత్మగౌరవ రాజకీయాల నినాదంతో ముందుకొచ్చారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ప్రజలకు ఆయన హృదయపూర్వక నమస్కారాలు తెలియజేస్తూ, ప్రజాసేవే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలతోనే తాను ఈ బరిలో నిలుస్తున్నానని, ప్రజల మద్దతే తన బలం అని పేర్కొన్నారు.

**ఆత్మగౌరవమే రాజకీయాలకు పునాది**

“ఆత్మగౌరవంతో బతకాలి, ఆత్మగౌరవంతోనే జీవించాలి అనే ఆలోచనతోనే నేను రాజకీయాల్లోకి వచ్చాను” అని పుదారి రేణుక శివకుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సమాజంలో ఆత్మగౌరవాన్ని తుంగలో తొక్కుతూ దోపిడీ, అక్రమాలు, హింసకు పాల్పడుతున్న వర్గాలకు వ్యతిరేకంగా నిలబడటమే తన రాజకీయ లక్ష్యమని వెల్లడించారు.

**బాధిత వర్గాల తరపున ధైర్యంగా పోరాటం**

సమాజంలో అణగారిన, బాధిత వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడటం, వారి హక్కుల కోసం నిర్భయంగా పోరాడటం తన ప్రధాన ఆశయమని తెలిపారు. ప్రతి కుటుంబం తలెత్తుకొని జీవించే వాతావరణం కల్పించడమే తన రాజకీయ ప్రయాణం ఉద్దేశమని అన్నారు. “మాటల రాజకీయాలు కాదుడ పనితోనే ప్రజల నమ్మకం సంపాదిస్తాను” అని పేర్కొంటూ, ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**12వ వార్డు అభివృద్ధే కార్యాచరణ**

12వ వార్డు సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, త్రాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే తన కార్యాచరణగా ఉంటుందని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా పారదర్శకంగా పనిచేస్తానని చెప్పారు.

**ప్రజల మద్దతుతోనే మార్పు**

ప్రజల భాగస్వామ్యంతోనే నిజమైన మార్పు సాధ్యమవుతుందని, 12వ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజల గొంతుకగా నిలబడి పోరాడతానని పుదారి రేణుక శివకుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు

# కృష్ణ కాలనీ వార్డులో స్థానికులకే అవకాశం

**మున్సిపల్ ఎన్నికలపై ఏకగ్రీవ నిర్ణయం**





**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** జమ్మికుంట పట్టణంలోని 27వ వార్డు కృష్ణ కాలనీకి చెందిన యువత, పెద్దలు కలిసి రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈసారి కృష్ణ కాలనీకి చెందిన స్థానిక వ్యక్తికే ఎన్నికల్లో అవకాశం ఇచ్చి, వారినే గెలిపించుకోవాలని కాలనీవాసులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలసదారులు కృష్ణ కాలనీ వార్డు నుంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచినప్పటికీ, అనంతరం కాలనీ సమస్యలపై తగిన శ్రద్ధ చూపకపోవడం వల్ల అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఇకపై పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో కాలనీవాసులు ఐక్యంగా ఈ నిర్ణయానికి వచ్చారు. స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలు, కాలనీ అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి మాత్రమే వార్డు ప్రతినిధిగా ఉండాలన్నదే తమ ప్రధాన లక్ష్యమని వారు స్పష్టం చేశారు. కృష్ణ కాలనీ అభివృద్ధి కోసం ఇకపై రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ, “మన కాలనీ భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. స్థానికుడే నాయకుడైతేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది” అని అభిప్రాయపడ్డారు. కృష్ణ కాలనీ వాసుల ఈ ఏకాభిప్రాయ నిర్ణయం పట్టణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది

# గుడ్ టచ్‌బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

**డా.చందు, డిప్యూటీ డీఎంహెచ్ఓ**




**సామాన్యుడి అస్త్రం హుజురాబాద్ :** విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు గుడ్ టచ్‌బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.చందు అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లిస్నేహిత కార్యక్రమం (పేజ్2)లిలో భాగంగా సోమవారం జమ్మికుంట మండలం గంట్రపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.వరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.చందు విద్యార్థులతో మాట్లాడుతూ, స్నేహిత కార్యక్రమం ఉద్దేశం బాలికలను శక్తివంతం చేయడం, వారి భద్రతను నిర్ధారించడమేనని తెలిపారు. పోక్సో వంటి చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులు తమ హక్కులను తెలుసుకుని ఆత్మవిశ్వాసంతో జీవించాలని సూచించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శను గుర్తించే అవగాహన ప్రతి విద్యార్థికి ఉండాలని, మంచి స్నేహితులను ఎంచుకోవడం ద్వారా అనేక సమస్యలను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్నేహిత ఫిర్యాదుల పెట్టె ద్వారా విద్యార్థులు పాఠశాల సిబ్బంది నుంచి గానీ, బయటి వ్యక్తుల నుంచి గానీ ఎదురయ్యే ఇబ్బందులపై భయపడకుండా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఈ ఫిర్యాదుల పెట్టెను షీ టీం బృందాలు పర్యవేక్షిస్తాయని పేర్కొన్నారు. బాలికల భద్రత అనేది కేవలం పోలీసు శాఖ లేదా ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, కుటుంబం, సమాజం, విద్యా వ్యవస్థ అందరూ సమిష్టిగా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరైనా బాలికలను వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా వెంటనే డయల్100కు ఫిర్యాదు చేయాలని, తక్షణమే పోలీసులు స్పందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, మానసిక పరిస్థితిపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంట్రపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి తోట కవిత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చందన, పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిర, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఐసీపీఎస్ కోఆర్డినేటర్ రమేష్, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, పంచాయతీ సెక్రటరీ రాములు, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం మణెమ్మ, ఆశా కార్యకర్త దీపిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# గత పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంటారా..

జోరుమీదున్నావు శంకరా..

ఈ జోరు కొనసాగేనా శంకరా..?

షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం..

ఇక కాంగ్రెస్– బీఆర్ఎస్ మధ్య కొనసాగనున్న యుద్ధం..?

సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ జయభేరి..

ఎంపీ ఎన్నికల్లోను తనదైన ముద్ర..

మరి చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ సాధిస్తుందా..?

వీర్లపల్లి ముందు అసలైన సవాల్..

బీఆర్ఎస్ నాట్ ఎ జోక్



**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి.. అదిరే విజయాన్ని సాధించాడు.. ఎంపీ ఎన్నికలు వచ్చాయి.. నియోజకవర్గం నుంచి మెజారిటీ ఇచ్చాడు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లోను ఓటు బ్యాంకును పెంచి సత్తా చాటాడు.. సర్పంచ్ ఎన్నికల్లో విజయభేరి మోగించాడు.. ప్రస్తుతం మున్సిపాలిటీ ఎన్నికలు ముందుకు వచ్చాయి.. మరో యుద్ధానికి రంగం సిద్ధమైంది.. గతంలో బీఆర్ఎస్ చేతిలోకి వెళ్లిపోయిన చైర్మన్ స్థానాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి తన వైపుకు తెచ్చుకుంటాడా.. మున్సిపాలిటీ ఎన్నికల్లో అదే సత్తా చూపిస్తాడా.. అన్ని విషయాల్లో జోరుమీదున్న మన శంకరుడు ఈ ఎన్నికల్లో కూడా అదే జోరును కొనసాగిస్తాడా.. ఒక్కసారి మున్సిపాలిటీ తాజా రాజకీయ పరిణామాలను పరిశీలించినట్లయితే..

**కాంగ్రెస్ కు ఆయువు పట్టు..**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను ఒక విధంగా కాంగ్రెస్ పార్టీకి ఆయువు పట్టు అని చెప్పవచ్చు. ఎందుకంటే నియోజకవర్గంలో 2019 ఎన్నికల తర్వాత జీరోగా మిగిలిన కాంగ్రెస్ కు తిరిగి ఆయువు పోసి హీరోగా మార్చాడు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కంచుకోట. కాని బీఆర్ఎస్ వచ్చాక ఈ కోట బీటలు వారింది. అలాంటి కోటలోకి సవాలుగా అడుగుపెట్టి ఒక్కో ఇటుకను పేర్చి తిరిగి నిర్మించాడు. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీని నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో పటిష్టం చేశాడు. ఆ ఫలితం గత అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన విజయం సాధించి పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు చెక్ పెట్టాడు. ఆ తరువాత ఎంపీ ఎలెక్షన్ లలో కాంగ్రెస్ గెలవక పోయినప్పటికీ ఈ నియోజకవర్గంలో నుంచి 7500 కు పైగా మెజారిటీని పార్టీకి తీసుకువచ్చాడు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోను ఇక్కడి నుంచి అధిక శాతం ఓట్లు కాంగ్రెస్ కూడగట్టుకోగలిగింది కొత్త ఓట్లను సంపాదించింది. సర్పంచ్ ఎన్నికల్లో రెబల్స్ తో 153 స్థానాలకు గాను కలిపి 85 స్థానాలను చేజిక్కించుకొని ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. ఇప్పుడు అసలైన సమయం వచ్చేసింది. మున్సిపాలిటీలో అసలు కాంగ్రెస్ సత్తా ఏమిటి..? గ్రామీణ ప్రాంతాల తరహాలోనే పార్టీకి ఆదరణ ఉందా.. కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తో తేల్చుకుంటుందా.. తేలిపోతుందా.. అన్నది ఒక్కసారి పరిశీలిస్తే..

**పార్టీ అయితే పటిష్టం..**

గత ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ ఈసారి పూర్తి పటిష్టతతో ఉందనేది స్పష్టం. ఎందుకంటే వార్డుల వారీగా పేరున్న నాయకుల సంఖ్య పార్టీకి బాగా పెరిగింది. అలాగే చాలామంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ అదనపు బలాన్ని చేకూర్చారు. దీనికి కారణం కూడా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని చెప్పక తప్పదు. గతంలో పార్టీ వీడి బీఆర్ఎస్ లో చేరిన చాలా మంది నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకువచ్చి ప్రతివార్డులోనూ కాంగ్రెస్ పార్టీ బలం పెంచడంలో ఎమ్మెల్యేది కీలకపాత్ర. ఈ క్రమంలోనే మున్సిపాలిటీలో ఉన్న 28 వార్డుల్లో కూడా కాంగ్రెస్ కు నాయకత్వ బలం అయితే ఉంది. ఈ నాయకత్వ బలాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని రెబల్స్ లేకుండా నేరుగా అభ్యర్థులను రంగంలో దించితే చైర్మన్ పీఠాన్ని సాధించుకోవడం పెద్ద విషయమేమీ కాదు. కానీ ఈ దిశగా చిత్తశుద్ధితో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేయాల్సిన అవసరం ఉంది. పురపాలికలో సత్తా చాటగలిగితేనే ఆ బలం నూటికి నూరుపాళ్ళు పార్టీకి ప్రయోజనం చేకూరుస్తుంది. మరి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గత పరాభవానికి ప్రతీకారం తీర్చుకునేలా ఈసారి బీఆర్ఎస్ మీద ఆదిపత్యం కనపరిచి చైర్మన్ పీఠాన్ని సాధించడమే ప్రస్తుతం ఆయన ముందున్న లక్ష్యం. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ సామవేద దండోపాయాలతో ముందుకు సాగుతుందనేది వాస్తవం. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితర పార్టీ ముఖ్య నాయకులతో కలిసి రెండు దఫాలు మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ఎంపిక గెలుపు అంశాలను పరిశీలిస్తూ చర్చ సాగింది. కృతుంగా హోటల్ తదితర సమావేశాలు వరుసగా జరిగాయి. నేడు వీ కన్వెన్షన్ హాల్లో కూడా మరోసారి పెద్ద ఎత్తున పార్టీ వర్గాలతో చర్చ ప్రారంభం కాబోతుంది. గెలుపే లక్ష్యంగా వీర్లపల్లి శంకర్ బలాన్ని పొందేందుకు కసరత్తు మొదలుపెట్టారు.

**బీఆర్ఎస్ నాట్ ఎ జోక్..!**

కర్ణుడు తనకున్న శాపాల కారణంగా యుద్ధంలో ఓడిపోయి ఉండొచ్చు.. కానీ అతని శక్తి సామర్థ్యాలను ఎప్పటికీ తక్కువ అంచనా వేయడం. నియోజకవర్గంలో అయినా, మున్సిపాలిటీలో అయినా బీఆర్ఎస్ స్థాయి కూడా అలాంటిదే. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నేతృత్వంలో గత మున్సిపాలిటీ ఎన్నికల్లో ఘనమైన విజయాన్ని ఆ పార్టీ సాధించుకుంది. 28 స్థానాలకు గాను 25 స్థానాలను గెలిచి చైర్మన్ పీఠాన్ని దక్కించుకోగలిగింది. అంతకు ముందు కాంగ్రెస్ చేతిలో ఉన్న చైర్మన్ పీఠం అమాంతంగా బీఆర్ఎస్ చేతుల్లోకి వెళ్లిపోయింది. కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలకు పరిమితం కావలసి వచ్చింది. అందుకని కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహంతో బీఆర్ఎస్ ను తక్కువ అంచనా వేసి తేలికగా తీసుకొని ముందుకు సాగితే చైర్మన్ స్థానాన్ని దక్కించుకోవడం చాలా కష్టం. ప్రతి వార్డులో ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త కష్టపడితేనే ఇది సాధ్యం. ఎందుకంటే బీఆర్ఎస్ కు కూడా ప్రతి వార్డులోనూ కరడు కట్టిన వీరాభిమానులు, అంకితభావంతో పనిచేసే కార్యకర్తలు, ఓటు బ్యాంకు ఉన్న నేతలు ఉన్నారు. కాబట్టి గట్టి పునాదితో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్ ను ఎదుర్కొని చైర్మన్ స్థానాన్ని సాధించుకోవాలంటే కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ చెమటోడ్చి పని చేయాల్సిందే. దీనిని సిన్సియర్ గా గుర్తిస్తేనే విజయం సాధ్యమవుతుంది. లేదంటే అధికార పార్టీ అభాసుపాలు కాక తప్పదు. కాబట్టి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తోడుగా నాయకులు కూడా గట్టిగా పని చేస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేర గలుగుతారు. అదేవిధంగా పార్టీలో గ్రూపు విభేదాలు లేకుండా ఇప్పటికే కేటీఆర్ తదితర పార్టీ అధిష్టాన వర్గీయులు ఒక క్లియర్ కట్ సందేశాన్ని కూడా పంపించారు. ఇది పార్టీకి బూస్ట్ గా మారబోతుంది. మునుపటి అంచనాలను నిలబెట్టుకున్న ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాబట్టి కాంగ్రెస్ నేతలూ.. తస్మాత్ జాగ్రత్త..

# షాద్ నగర్ లో బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

షాద్ నగర్ పట్టణంలోని 20వ వార్డు గంజిలో ఏర్పాటు..

ఉదయం 9 గం నుండి సాయంత్రం 4 గం వరకు అన్ని వైద్య సేవలు అందుబాటులో..

అన్ని రకాల వైద్య సేవలతో పాటు మందులు కూడా అందుబాటులో ఉంటాయి..

ప్రతివారం ఒక్కొక్క రోజు ఒక్కొక్క వైద్య సేవలు అందుబాటులోకి..







**సామాన్యుడి అస్త్రం షాద్ నగర్ :** షాద్ నగర్ పట్టణంలోని కాలనీలోని 20వ వార్డు పాత గంజి లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి కే లలితాదేవి తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ విజయలక్ష్మి,హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, డిపిఓ అక్రమ్, సీసీ సురేష్,డాక్టర్ స్రవంతి చించోడు,డాక్టర్ దామోదర్, ఏఎన్ఎం,ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేటు దవాఖానాలకు దీటుగా తీర్చిదిద్ది అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని సర్కారు దవాఖానాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించి పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. మా ప్రభుత్వ ముఖ్యంగా వైద్యం,విద్య ఈ రెండిటికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని అప్పుల పాలు అవుతున్నారని అందుకే పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఈ దవఖానాల్లో ప్రతి రోగానికి రక్త పరీక్షలతో పాటు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందని ఇక్కడున్న సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అతి త్వరలో షాద్నగర్ పట్టణంలో ఏర్పాటు కాబోయే 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.. అనంతరం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలిత దేవి మాట్లాడుతూ ఈ బస్తీ దవఖన సెంటర్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ఇందులో స్టాఫ్ నర్సులతో పాటు, అదనపు సిబ్బంది ఒక మెడికల్ ఆఫీసర్ అందుబాటులో ఉంటారని అందరికీ ఒపీ చూడబడతాయని అన్ని రకాల టెస్టులను తెలంగాణ డయాగ్నెటిక్స్ హబ్ కి పంపించడం జరుగుతుందని ఇందులో 134 పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఈ బస్సు దావకానకు ప్రభుత్వ మెడికల్ వాహనం వచ్చి శాంపిల్స్ కలెక్ట్ చేసుకుని తెలంగాణ డయాగ్నోసిస్ సెంటర్ కు ఇవ్వడం జరుగుతుందని 24 గంటల్లో పేషంట్స్ వాట్సప్ కి రిపోర్ట్స్ యొక్క రిజల్ట్సు సమాచార రూపం అందివ్వడం జరుగుతుందని.అలాగే ప్రతి సోమవారం గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించ బడతాయని అలాగే ప్రతి మంగళవారం 15 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మహిళల వరకు అన్ని రకాల వైద్య సేవలు వీరికి అందించబడతాయని అలాగే బుధవారం శనివారం ఇమినేషన్ అనే ప్రత్యేక ప్రోగ్రాం ఉంటుందని.గురువారం పెద్దవారికి ఓపి క్లీనింగ్ తో పాటు ప్రతివారం ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమం తో పాటు బీపీ మరియు షుగర్ ఉన్నవారికి ప్రతి నెల నెల మందులు ఇవ్వడం జరుగుతుందని. అలాగే శుక్రవారం ప్రతి గర్భిణీ స్త్రీ కి పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. శనివారం ఒక్కరోజే సెలవు దినంగా ప్రకటించడం జరిగింది.అయితే ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంకల చెన్నయ్య ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, షాద్నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి,ఫరూఖ్ నగర్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగనూరి బస్వం, ముబారక్ అలీ, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు..

## అరకు వ్యాలీలో వైఎస్సార్సీపీ అభివృద్ధి ముద్ర

డా. గుమ్మ తనూజ రాణి నిధులతో ₹15 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సామాన్యుడి అస్త్రం అల్లూరి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్సీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అరకు వ్యాలీ మండలం ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ డౌన్ కాలనీలో ఎంపీ నిధుల ద్వారా ₹15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎన్నో ఏళ్లుగా రహదారి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న డౌన్ కాలనీ వాసులకు ఈ నిర్మాణం పెద్ద ఊరట కలిగించనుంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేస్తున్న అరకు ఎంపీ డా. గుమ్మ తనూజ రాణి చొరవ ఫలితంగానే ఈ పనులు సాధ్యమయ్యాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, సూపర్ ఎంపీపీ నరసింగమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని, వైఎస్సార్సీపీ పాలనలోనే గ్రామీణ ప్రాంతాలకు సమాన అభివృద్ధి జరుగుతోందని అన్నారు. మాటలకే పరిమితం కాకుండా పనుల ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నది వైఎస్సార్సీపీ మాత్రమేనని వారు స్పష్టం చేశారు. స్థానిక ఎంపీటీసీ దురియా ఆనంద్ కుమార్, సర్పంచ్ దాసుబాబు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు స్వాభి రామూర్తి, అల్లూరి జిల్లా యువజన విభాగ మాజీ అధ్యక్షుడు ఎల్.బి. కిరణ్ కుమార్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మద్యకెడి బాలరాజు, బస్కి మాజీ సర్పంచ్ అప్పలస్వామి, నొబో, పూర్ణచందర్, మాజీ సర్పంచ్ సన్యాసి, ఉప సర్పంచ్ స్వాభి ఏలిశ్వరావు, ఉప సర్పంచ్ రామ్ చందర్, మండల నాయకులు ఎల్.బి. ఆనంద్, దేవదాస్, రాము, ప్రసాద్, గురుమూర్తి, ధర్మ నాయుడు, లక్ష్మణ్ తదితరులు ప్రజల దైనందిన జీవితం సులభతరం అవుతుందని నాయకులు తెలిపారు. మాటలకే పరిమితం కాకుండా, అభివృద్ధిని నేలమీద చూపిస్తున్న వైఎస్సార్సీపీ నాయకత్వానికి ఇది మరో నిదర్శనమని వారు అన్నారు.

## నేడు సావెల్ లో పర్యటించనున్న మంత్రి సీతక్క





**సామాన్యుడి అస్త్రం బాల్కొండ :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నిజామాబాద్ జిల్లా ఇంచార్జి సీతక్క నిజామాబాద్ జిల్లా పర్యటనలో బాగంగా నేడు ఉదయం పది గంటలకు సావెల్ గ్రామంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 2.15 కోట్ల రూపాయలు మంజూరు అయిన సిఆర్ఆర్ నిధులతో సావెల్ గ్రామం నుంచి తడపాకల్ రోడ్డు బిటి రోడ్డు పనులు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. శంకుస్థాపన అనంతరం 10:30 గంటలకు ఆర్మూర్ కు తిరుగు ప్రయాణం అవుతారు. సీతక్క కు స్వాగతం పలుకనున్న కాంగ్రెస్ నాయకులు బుధవారం ఉదయం పది గంటలకు సావెల్ గ్రామంలో పర్యటించనున్న సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు , ప్రజాప్రతినిధులు , కార్యకర్తలు ఉదయం 9:30 గంటలకు సోన్ బ్రిడ్జ్ చాకిర్యాల్ శ రోడ్ వద్దకు చేరుకుని మంత్రి సీతక్క కు ఘన స్వాగతం పలుకుతారు.

## నల్లూర్ లో టిబి అభియాన్ కార్యక్రమం





**సామాన్యుడి అస్త్రం బాల్కొండ :** మెండోరా మండల కేంద్రం లోని పోచంపాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ మద్దుల రాకేష్ ఆధ్వర్యంలో నల్లూర్ గ్రామంలో టిబి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా క్షయ నిర్ధారణ కొరకు పరీక్షలు నిర్వహించి టీబీ అనుమానిత కేసులను, పాత టీబీ పేషంట్లను, షుగర్ వ్యాధి, మద్యపానం త్రాగే వారికి 45 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.టిబి లక్షణాలు ఉన్న వారు స్థానిక ఆరోగ్య సిబ్బందిని కార్యకర్తలకు సహకరించి టిబి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మద్దుల రాకేష్ , సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి , హెచ్ఈఓ వేణు , సూపర్వైజర్ వనమాల , ఎఎన్ఎం చంద్ర బాగ , ఆశాకర్యకర్త సూర్య కళ , టిబి ఎస్ఎల్ టిఎస్ సంతోష్ , రోగులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా జనసేన కార్యకర్తల సమావేశం



**సామాన్యుడి అస్త్రం జనగామ** వరంగల్ జిల్లా మున్సిపల్ కో ఆర్డినేటర్ దామోదర్ రెడ్డి రాకతో మున్సిపల్ ఎన్నికల సమావేశం నిర్వహించడం జరిగింది ఉమ్మడి వరంగల్ జిల్లా మున్సిపల్ కో ఆర్డినేటర్ దామోదర్ రెడ్డి ,యువజన విభాగం అడ్ హాక్ కమిటీ సభ్యులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు మహమ్మద్ గౌస్ జనసేన పార్టీలో జాయిన్ అవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా నాయకులు నామాల సిద్దులు గౌడ్,రమేష్ రెడ్డి,రాజ్ కుమార్, కిరణ్ మరియు జనసైనికులు పాల్గొనడం జరిగింది

## మున్సిపల్ ఎన్నికలలో ప్రజా సమస్యల పరిష్కార మే ధ్యేయంగా పోరాటాల నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థుల గెలుపు కార్యకర్తలు కృషి చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పిలుపు





**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పట్టణంలో అనునిత్యం ప్రజా సమస్యల పైన ప్రజల పక్షాన నికరంగా పోరాటం నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను ఎన్నికలలో గెలిపించాలని అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పిలుపునిచ్చారు మంగళవారం జనగామ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్ లో సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎండి అబ్బాస్ గారు మాట్లాడుతూ జనగామ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు ఇండ్లు ఇండ్ల స్థలాలు జనగామ పట్టణ అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరగాలని పట్టణంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలని అలాగే పట్టణ సుందరీ కరణ జరగాలని జనగామ జిల్లా ఏర్పడినప్పటి నుండి జిల్లా స్థాయి అభివృద్ధి పెద్దగా జరగలేదని పట్టణం అభివృద్ధి అయితేనే జనగామ జిల్లా అభివృద్ధి కావడానికి అవకాశం ఉంటదని అందుకోసం ప్రజా సమస్యల పైన పట్టణ సమస్యల పైన ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్న సిపిఎం పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను గెలిపిస్తే పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందని గతంలో సిపిఎం నుండి గెలిచిన కౌన్సిలర్లు అనేక సందర్భాల్లో మున్సిపల్ వేదికగా ప్రజా సమస్యల్ని గొంతెత్తి వాటి పరిష్కారం కోసం కృషి చేసిన చరిత్ర సిపిఎం కు ఉన్నదని వివరించారు సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీగా విలువలకు కట్టుబడి పని చేసే సిపిఎం పార్టీ నుండి పోటీ చేసే అభ్యర్థులను ప్రజలు ఆదరించి పట్టణంలో అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య బొట్ల శేఖర్ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి సుంచు విజేందర్ ఎండి అజారుద్దీన్ సీనియర్ నాయకులు ఎండి దస్తగిరి పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం బాల్నే వెంకట మల్లయ్య బొట్ల శ్రావణ్ పందిళ్ళ కళ్యాణి పల్లెర్ల లలిత పగిడిపల్లి బాలమణి బూడిది ప్రశాంత్ మంగ బీరయ్య ధరావత్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు

